# పిచ్చి తల్లి

ఆ పాలెంలో కాంతమ్మ పేరు విననివాళ్ళు లేరు. అసలు కాంతమ్మ తల్లికూడా అట్లాగే పేరు సంపాదించుకుంది ఆ కాలంలో. కొందరి వ్యక్తుల పేర్లు వృత్తివిద్యలవల్ల బయటికెక్కుతాయి. కాంతమ్మపేరూ, ఆవిడ తల్లిపేరూ అట్లా బయటికెక్కిన బాపతే. కాంతమ్మతల్లి కాపురంచేసే కాలంలో ఆ పాలెంలో ఆవిడదొక్కటే గుడ్డలుకుట్టే మిషన్. ఆడా, మగా, పిల్లా, జెల్లా అంతా ఆవిడదగ్గరే గుడ్డలు కుట్టించుకునే వాళ్ళు. కాంతమ్మ 'యెదిగి' విద్య నేర్చుకొని, మగవాడ్నికట్టుకొని కాపురాన్ని నిలబెట్టుకొనే సమయంలో అబ్దుల్ ఖాదర్ ఖాన్, షావుకారు చలమయ్యగారి వడ్లకొట్టు పంచెపాళీలో కొత్త మిషన్‌కొని కాంతమ్మకు పోటీగాపెట్టాడు. అయినా కాంతమ్మ జీవనం కుంటుపడలేదు. ఆవిడకొచ్చే డబ్బు ఎటూ వొస్తూనే వుంది. పాలెంలోని ఆడంగులంతా సాటి స్త్రీ అనే అభిమానం

చేత కానీయండి, ఒక అణాడబ్బులు తక్కువ తీసికొంటూన్న దనే ఆశతోనైనా కానీయండి - కాంతమ్మకే గుడ్డలు కుట్టేం దుకు ఇస్తారు. కాంతమ్మ మొగుడు దరిద్ర దామోదర చక్రవర్తి. పనికి పోతరాజు, తిండికి తిమ్మరాజూను. కాంతమ్మ సంపాదనంతా కాలుమీద కాలువేసికొని ఖర్చుచేస్తూ వుంటాడు. కాని ఆ భర్తనే దైవసమానుడిగా యెంచుకొనే కాంతమ్మ పసుపూ, కుంకుమ ఎక్కువకాలం నిలువలేదు. కాంతమ్మకు కూతురు కలిగాక మూడేళ్ళకు ఒకానొక పుణ్యా కాలాన సర్పగండంవల్ల మృతిజెందాడు. అప్పట్నుంచీ కాంతమ్మ కూతుర్నే సర్వస్వంగా భావించుకొని కంటికి రెప్ప లాగా, ప్రాణానికి ప్రాణంగా పెంచుతూ వొస్తూంది.

కాంతమ్మ కూతురి పేరు లక్ష్మి. ఆ పాలెంలోని బోర్డు హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్లో అయిదో క్లాసువరకూ చదువుకుంది. ఆకాలంలోనే ఆ పిల్ల, గుడ్డలు కుట్టే సమయంలో శక్తివంచన లేకుండా తల్లికి సహాయపడేది. కాంతమ్మకు ఎంతో ఆనందం వేస్తూవుండేది. అయిదో క్లాసు కావటం తోనే స్కూలు చదువు మాన్పించి మిషన్ మీద కూర్చో బెట్టింది. ఆరు మాసాల్లోనే లక్ష్మి ఆ విద్యలో ఆరితేరింది. జాకెట్లూ, గౌన్లూ, మగవాళ్ళ చొక్కాలు కత్తిరించటం, కుట్టటం మొదలెట్టింది. పనిలో కూతురు పైకియెక్కివొచ్చాక, కాంతమ్మకు బాగా విశ్రాంతి తీసికొనే అవకాశం చిక్కింది. రానురాను ఆవిడ పనల్లా ఊళ్ళోకి వెళ్ళి కుట్టేందుకు గుడ్డలు తీసికొని రావటమూ, కుట్టిన గుడ్డలు యిచ్చి డబ్బు వసూలు చేసుకోవటమూను!

కాని లక్ష్మిని ఆవిడ ఎన్నడూ గుడ్డలు తీసుకురావటానికీ, కుట్టిన గుడ్డల్ని యిచ్చి రావటానికీ పంపేది కాదు. ఇప్పుడు లక్ష్మికి యుక్త వయస్సు వొచ్చాక అలాంటి విషయాల్లో ఆవిడ అతిజాగ్రత్తగా వుంటూ వస్తున్నది.

యుక్త వయస్సు వొచ్చాక, లక్ష్మి అందం గులాబి పువ్వు బాగా విచ్చుకున్నట్టుగా పెరిగింది. అసలే ఆమె శరీర చ్ఛాయ సాయంత్రం మబ్బుల్ని వెలిగించే సూర్యకాంతి లాంటిది. పదిహేడేళ్ల ప్రాయం వొచ్చేప్పటికి ఆమె శరీర చ్ఛాయ బంగారాన్ని పులుము కున్నట్టుగా వుండటంలో ఆశ్చర్యం లేదు. ఆమె కన్నుల సౌందర్యం గొప్పది. మగవాడి హృదయంలో మోహాన్ని రేపే మంత్ర శక్తి ఆమె చూపులకు ఉన్నదని, ఆమెను చూసిన ప్రతి యువకుడూ వొప్పుకుంటాడు. లక్ష్మి ఇంత అందమైన యువతి కావటంవల్లనే కాంతమ్మ మనస్సుకు శాంతిలేకుండా పోతూవుంది. లక్ష్మిని ఒక్కసారి గూడా చూడటానికి నోచుకోని ఆపాలెపు యువకులు చాలా మంది ఆ వీధిలో అనవసరంగా పచార్లు చేస్తూ వుండటం, వెకిలి నవ్వులు నవ్వుతూ వుండటం కొంతమందికి ఆశ్చర్యంగానే వుంటుంది. పాపం! లక్ష్మికి యీ వ్యవహారమంతా తెలియదు. తనని చూడటానికి కొంతమంది యువకులు అరికాళ్ళను అరుగ కొట్టుకుంటున్నారని తెలిస్తే, ఆమె యింత తక్కువగా ముఖాన్ని బజారుకేసి చూపించకుండా వుండేదేమో!

పదిహేడేళ్ళు వొచ్చినప్పటికీ లక్ష్మికి వేరే వ్యక్తిత్వం లేదు. ఆమె జీవితమూ, భవిష్యత్తూ, హృదయమూ, అంతా

తల్లి వ్యక్తిత్వం మీద ఆధారపడ్డవే! ఆమెకు స్వతంత్రంగా భావాలు లేవు. అభిరుచులు అంతకంటే లేవు. తల్లి మల్లె పువ్వులు కొనుక్కోమని చెబితే, కొనుక్కొని జడలో అలంకరించుకుంటుంది. తల్లి ఫలానా చీరె, జాకెట్టు గుడ్డ కొనుక్కోమని చెబితే కొనుక్కుంటుంది. పగటిపూట బజారు వాకిటిలో నిలబడరాదంటే—అట్లాగే చేస్తుంది. ప్రక్క ఇంటి ఇల్లాలితో మాట్లాడేందుకు కూడా తల్లినే అనుమతి అడుగుతుంది.

కూతురుకు పెళ్ళిచేయాలనే ఆలోచన కాంతమ్మకి రెండు సంవత్సరాలుగా వుంది. కాని మంచి వరుడు దొరకలేదు. అక్కడక్కడా విచారిస్తూనే వుంది. బాగా చదువుకున్న వాడికి పిల్లనిద్దామని కాంతమ్మ అభిప్రాయం. ఆవిడకు రెండెకరాల పొలం వుంది. రెండువేల రూపాయలు నిల్వలో వున్నాయి. మంచి వరుడే లభించవచ్చు. నాలుగెకరాల ఆస్తిగల వాడే రావొచ్చు. చదువుకున్నవాడైనా స్థిరాస్తి లేనివాడికి కాంతమ్మ కూతుర్ని ఇవ్వదల్చలేదు. కాని పిల్ల ఎదుగుతున్నకొద్దీ త్వరగా పెళ్ళిచేయాలనే ఆలోచన ఆవిడకు కలుగుతోంది. నిత్యమూ వీధిలో వేషాలువేసే పోకిరీవాళ్ళను చూస్తున్నకొద్దీ అమ్మాయికి త్వరత్వరగా పెళ్ళి చేయడమే ఉత్తమంగా అగపడుతోంది. కాంతమ్మ జీవితంలో శేషించిన కోర్కె ఇది ఒక్కటే. సుగుణవంతుడూ, ఆస్తిపరుడూ, జ్ఞానవంతుడూ మైన యువకుడికి లక్ష్మి నిచ్చి పెళ్ళి చెయ్యడం!

రెండు రోజుల్నుంచీ కాంతమ్మకు జ్వరం వొస్తూవుంది. పాలెపు వైద్యుడు మంగలి కిష్టప్ప మందు యిస్తున్నాడు. కాని

జ్వరం తగ్గలేదు. లక్ష్మికి ఊపిరాడటం లేదు. దిగులుగా తల్లి మంచం దగ్గరే కూర్చుంటున్నది.

"నా దగ్గరెందుకే తల్లీ! పోయి కరణంగారి కూతుళ్ల గౌన్లుకుట్టు. నా జ్వరం, ఇవాళ కాకపోతే రేపుపోతుంది. వెళ్లి పని చూసుకో!" అన్నది కాంతమ్మ ఒకరోజు మధ్యాహ్నం.

"కాదమ్మా! నీకు జబ్బు నయమయ్యే వరకూ నేను మిషన్ మీద పని చేయను" అన్నది లక్ష్మి భయంగా.

"పిచ్చి తల్లీ! నా రోగానికీ, నువ్వు పని చేసుకోటానికీ సంబంధ మేమిటే! మంచం దగ్గర కూర్చుని ఉపచర్యలు ఊపిరాడకుండా నువ్వు చేయాల్సిన స్థితి ఇంకా నాకు పట్ట లేదు. నీ కెందుకు; నువ్వు గుడ్డలు కుట్టు. కరణంగారి భార్య రేపు తప్పకుండా గౌన్లు కావాలన్నది. పిల్లలు ఊరు వెళతారట."

తల్లికి ఎదురు చెప్పలేక లక్ష్మి దిగులు ముఖంతోనే మిషన్ దగ్గరి పీటమీద కూర్చుంది.

ఆ సాయంత్రం కాంతమ్మ కోసం మున్సబుగారి జీతగాడు వొచ్చాడు. "సుభద్రమ్మగోరు మిమ్మల్ని పిల్చుకురమ్మన్నా రండి, గుడ్డలు కుట్టాలంట."

కుక్కి మంచంలో పడివున్న కాంతమ్మ ఆ మాటలు విన్నది. జీతగాడు స్తంభం ప్రక్కనే నిలబడ్డాడు. కాంతమ్మ ఆలోచనలో పడింది. 'తను వెళ్ళలేదు. కూతుర్ని గుడ్డలకోసం పంపటమా, మానటమా? ఒక వేళ పంపకపోతే సుభద్రమ్మ

గారికి కోపం వొస్తుందేమో! ఆవిడ ఎంతో ఉత్తమురాలు. ఆవిడ తన పలుకుబడిమీద ఆ వీధిలో అందరిచేత తనకే గుడ్డలు యిప్పిస్తున్నది. తను అశ్రద్ధచేయకుండా అమ్మాయిని పంపడమే శ్రేయస్కరం. ఆవిడకు కోపాన్ని తెప్పిస్తే ఊళ్లో తనకు పలుకుబడి క్షీణిస్తుంది.'

"సరే! అమ్మాయి లక్ష్మీ; నువ్వు జీతగాడివెంట మున్సబుగారింటికి వెళ్ళిరా." అన్నది. కాంతమ్మ.

లక్ష్మి ఆశ్చర్యపడింది. మారుమాట్లాడకుండా కత్తెరా, టేపూ తీసికొని జీతగాడివెంట బయలుదేరింది.

అప్పటికి యింకా ప్రొద్దుకుంకలేదు.

అమ్మాయి గుడ్డలకోసం వెళ్లటము ఇదే ప్రథమం! చిన్నతనంలో దానికి మాట్లాడటం తెలియదని తను వెళ్లనివ్వలేదు. ఇప్పుడు యుక్తవయస్సు వొచ్చాక ఒక్కదాన్నే బజార్ల వెంట పంపటం బాగుండదని తను వెళ్ళనివ్వటంలేదు. ఊళ్ళో ఎంతోమంది పోకిరీలుంటారు. త్రోవనబోయే ఆడవాళ్ళను ఏదో పొగరుదిగిన మాటలంటారు. వెకిలిగా నవ్వుతారు, కనుసైగలు చేస్తారు. ఆ చేష్టలకు అమ్మాయిలాంటివాళ్ళు భయపడతారు. అందులో తక్కువకులపు స్త్రీ లంటే మరీచులకన. చప్పున అనేస్తారు. మున్సబుగారి ఇంటికి గనుక తను అమ్మాయిని పంపించింది కానీ, మరొకళ్ల యింటికి తను పంపించేదేనా?...దోవలో ఎవరైనా పోకిరీవాళ్లు వున్నారేమో! ఉన్నా...ప్రక్కన మున్సబుగారి జీతగాడు ఉన్నాడు

గదా...వాళ్ల యింటికి వెళుతూంటే అనేవాళ్లకు కూడా భయమే!'

"కాంతమ్మ వొదినా!" అంటూ కామాక్షమ్మ వసారాలోకి వొచ్చింది.

"ఎవరూ! కామాక్షమ్మా! వొచ్చి కూర్చో..." అన్నది కాంతమ్మ బరువుగా.

కామాక్షమ్మ కాంతమ్మ స్నేహితురాలు. కామాక్షమ్మకు ఒక నిట్టాడి పూరికొంపవున్నా, రోజులో ఏ కొన్ని గంటలు వుంటుందో - మిగతా గంటలన్నీ ఊరిమీదనే వుంటుంది. ఇంటింటికెళ్ళి సమాచారాలు కనుక్కొని వస్తుంది. కాలక్షేపంకోసం కూరగాయల కబుర్లు చెబుతూ వుంటుంది. ఆవిడను ఎవ్వరూ నమ్మరు. ద్వేషించరు. కొంతమంది ఇల్లాళ్ళు ఏమైనా వండుకున్న వస్తువులు పెడతారు.

"వొంట్లో ఎలా వుంది వొదినమ్మా?" అన్నది కామాక్షమ్మ దీర్ఘాలు తీస్తూ.

"ఏదో...ఇంకా జ్వరం తగ్గుముఖం పట్టలేదు. ప్రొద్దున కూడా జ్వరం నూట రెండున్నర వుంది."

"పోనీ ఇంగ్లీషు డాక్టరుగారికి చూపించక పోయినావా?"

"ఊఁ! ఎవరైనా ఒకటే" అన్నది కాంతమ్మ నిట్టూర్పు విడుస్తూ. ఇంగ్లీషు డాక్టరుకు ఎక్కువ డబ్బు ఇవ్వాల్సి వొస్తుందని భయం.

"వొదినా...లక్ష్మి యేదీ!" అన్నది కామాక్షమ్మ ఆశ్చర్యంగా.

"మున్సబుగారి భార్య సుభద్రమ్మగారు గుడ్డలు తీసి కెళ్ళమని కబురంపితే నేనే మాట తీసివేయలేక పంపించాను. నాకు వెళ్లే ఓపిక లేదు."

"సుభద్రమ్మగారు పంపించారా? ఆవిడ ఊళ్లో లేదే! రెండు రోజులైంది అల్లుడుగారి ఊరెళ్ళి. ప్రొద్దునే వాళ్ళ ఇంటికి వెళితే మున్సబుగారు చెప్పారు నాకు. ఆశ్చర్యంగా వుంది వొదినా!" అన్నది కామాక్షమ్మ, కాంతమ్మ మాటను నమ్మ శక్యం గాకుండా ఉన్నట్టు.

కాంతమ్మ గుండెలు గతుక్కుమన్నాయి.

"ఆఁ! నిజంగానే. వాళ్ళ జీతగాడు స్వయంగా వొచ్చి సుభద్రమ్మగారు రమ్మన్నారని పిలుచుకు వెళితేనూ!"

"పొరబాటు వొదినా! సుభద్రమ్మగారు ఊళ్ళో లేరు. అదిమాత్రం నిజం. ఇంకా ఎవరైనా పిలుచుకు రమ్మన్నారేమో..." సందేహంగా అన్నది కామాక్షమ్మ.

"అంటే—"

కామాక్షమ్మ గొంతులో వెలక్కాయ ఇరుక్కుంది.

"ఆ ఇరుగు పొరుగు స్త్రీలు అట్లా అని పిలుచుకు రమ్మన్నారేమో!"

"ఏమో నాకు భయంగా వుంది. కామాక్షమ్మా!"

"నాకూ అలాగే వుంది వొదినమ్మా. ఆ ఇంట్లో ఈ వేళప్పుడు మున్సబు గారు వుండరు. మామిడి తోటలోకి వెళతారు. పోతే జీతగాడూ, కొడుకూ వుంటారు. కొడుకు ప్రవర్తన మంచిదికాదు వొదినా..."

కాంతమ్మకు కామాక్షమ్మ మాటలు మరీ భయం కలిగించాయి.

"నువ్వు ఏమనుకోకుండా వుంటే నాకు ఒక అనుమానం వేస్తూంది. సుభద్రమ్మ గారు ఇంట్లోలేని సమయంలో జీత గాడు అమ్మాయిని తీసి కెళ్లటంలో ఏదో దురాలోచన వుంది. ఇదివరలో రెండు మూడుసార్లు మున్సబుగారి అబ్బాయి నన్ను 'కాంతమ్మ కూతురు ఎట్లా వుంటుందీ?' అని ప్రశ్నించాడు. అప్పుడే అతని మనస్సులోని మలినాన్ని నేను గ్రహించాను. ఇది ఆ అబ్బాయి పన్నిన కుట్రే వొదినా!"

కాంతమ్మకు గుండె పగిలినంత పనవుతోంది. అసలే జ్వరంతో బలహీనంగా వున్న ఆవిడ గుండె భయంతో తెగ వూగిసలాడింది. దుఃఖంతో కళ్ళంట నీళ్ళు తిరిగాయి. అమ్మా యికి ఏం అపాయం సంభవిస్తుందో నన్న ఆదుర్దాతో ఆవిడకు మంచంమీద పడుకో బుద్ధివేయలేదు. మంచంమీద నుంచి బలవంతంగా లేచేందుకు ప్రయత్నించింది. కాని లేవలేక పోయింది. కాంతమ్మ పడే ఆదుర్దాని కామాక్షమ్మ గుర్తించింది.

"వొదినా, నువ్వు లేవలేవు. నేను వెళ్ళివస్తాను. నువ్వేం భయపడకు. అమ్మాయికేం అపాయంజరగదులే. అవసరమైతే పదిమంది మగవాళ్ళతో చెప్పియైనా సరే మున్సబుగారి

అబ్బాయి దుష్ట బుద్ధికి తగినట్టు శాస్తి చేయిస్తాను. నువ్వేం భయపడమాకు.” కామాక్షమ్మ అక్కడ్నుంచి లేచి వెళ్లింది విసురుగా.

అప్పటికీ కాంతమ్మకు మంచములో పడుకో బుద్ధి వెయ్యలేదు. మనస్సంతా భయంతోను, చీకాకుతోను, ఆదుర్దాతోను నిండి ఉంది.

‘లక్ష్మికి ఏం అపాయం సంభవిస్తుందో! ఆ జీతగాడి సహాయంతో మున్సబుగారి అబ్బాయి అమ్మాయిని బలవంతం చేస్తాడేమో! అమాయికపుది...అరవటం కూడా చేతకాదు. మున్సబుగారి అబ్బాయి ఒట్టి పోకిరీవాడు. అతనికింద ఎంతో మంది రౌడీలుకూడా వుంటారట. లక్ష్మిని ... లక్ష్మిని ... బలవంతంగా...అనుభవిస్తాడేమో! అందుకనే నేమో ఇలా మోసంచేసి పిలిపించడం?...అమ్మాయి గతి ఏంకాను? ఏ కత్తినో తీసి భయపెడితే; దానికి నోటినుంచి మాటకూడా రాదు. ఏంచేసినా ఫూరుకుంటుంది. తనదే తెలివితక్కువ. తనెందుకు పంపించాలి? తనకేం తెలుసు ఈ దుర్మార్గమంతా! ...అమ్మాయి గతేంకాను? ఈ విషయం ఊళ్ళో తెలిస్తే అమ్మాయికి జీవితంలో పెళ్ళి అవుతుందా? తెలియకుండా ఎట్లా ఉంటుంది? ఎంతఅవినీతి? ఎంతఅప్రదిష్ట? అసలే తమది తక్కువ కులం; తమ చరిత్రని బజారు కెక్కించేందుకు ఎవ్వరూ వెనుకాడరు. తమ బ్రతుకు చవుకై పోతుంది. అమ్మాయికోసం నిత్యమూ బజారు వెంట పచార్లుచేసే పోకిరీ వెధవలంతా తన

ఇంటిచుట్టూ ముట్టడి వేస్తారు. ధైర్యచేసి లోపలకు వస్తారు. తనేం చేయగలుగుతుంది? తన కూతురేం చేయగలుగుతుంది? ఇక అప్పుడు తమకు ఊరు విడిచిపెట్టి వెళ్ళడంకంటే మరో గత్యంతరం ఉండదు. ఈ ఊరు విడిచి పెట్టటం ఎట్లా? మరో కొత్త గ్రామంలో జీవించగలుగుతుందా? ఎట్లా భగవంతుడా అమ్మాయి ఈ విపత్కర పరిస్థితినుంచి బయటపడేది? పాతివ్రత్యానికి యీ కాలంలో మహిమలేదా? మగవాడి దౌర్జన్యంనుంచి స్త్రీ తనని రక్షించుకో లేదా? లక్ష్మి.... లక్ష్మి! ఎంత ఆపదలో ఉన్నావో! ఇన్నాళ్లు కంటికి రెప్పగా, ప్రాణానికి ప్రాణంగా తను పెంచింది. కాని ఇవాళ ఏదో శని గ్రహం చుట్ట వేసుకుంది. తన చేతులతోనే అమ్మాయిని నరకకూపంలోకి తరిమింది. తను పాపిష్టిది.'

ఇట్లా కాంతమ్మ కుక్క మంచంలో బాధ పడుతూండగానే లక్ష్మి తూలుతూ వొచ్చింది. ఆమె ఆకారం చూడగానే కాంతమ్మకు గుండె ఆగినంత పనైంది. లక్ష్మి జుట్టు చెదిరి వుంది. ముఖంనిండా చెమట పట్టివుంది. ముఖం అలసినట్టు అగపడుతోంది. తల్లిని చూడగానే లక్ష్మి బావురుమని ఏడ్చింది.

కాంతమ్మ కూడా బావురుమని ఏడ్చింది. కూతురు మున్నబుగారి అబ్బాయిచేత బలవంతం చేయబడ్డట్టే నిర్ణయించుకుంది కాంతమ్మ. కొన్ని నిముషాలకు—

"ఏమిటే తల్లీ! ఏం జరిగింది? నిన్ను ఎవరు ఏం చేశారు?" అన్నది కాంతమ్మ.

"అమ్మా!...అమ్మా! మరే..." చెప్పేందుకు లక్ష్మికి మాటలు త్వరగా గొంతునుంచి రాలేదు. భయపడ్డట్టు లక్ష్మి వొణికిపోతోంది.

"ఆఁ! ఏం జరిగింది?"

"అమ్మా! అక్కడే...ఆ చెట్టుక్రింద నరసమ్మగారి ఇల్లు లేదూ...?"

"ఆఁ! వుంది. ఉంటే ఏం జరిగింది?"

"ఆ ఇంటి కోడలు లేదూ...కోడలు. అత్తగారు పెట్టే బాధలను ఓర్చుకోలేక...ముఖంనిండా పసుపు రాసుకొని... రూపాయి వెడల్పున ఎఱ్ఱటి కుంకుమ పెట్టుకొని...బావిలో దూకిందమ్మా! పొరుగువాళ్ళు పైకి తీశారమ్మా!"

"బ్రతికిందా?"

"ఆఁ!...అమ్మా! అత్తలు కోడళ్ళని అట్లా కష్టాలు పెడతారా?"

"కొంతమంది అట్లా పెడతారు."

"అయితే నాకు పెళ్ళొద్దమ్మా! నేను ఇట్లాగే ఉండిపోతానమ్మా" అంటూ తల్లిని కౌగలించుకుంది.

కాంతమ్మకు నవ్వు వొచ్చింది అంత ఆదుర్దాలోనూ.

"సుభద్రమ్మగారు గుడ్డలు ఇవ్వలేదూ ?"

"వాళ్లింటికి వెళ్ల లేదు. త్రోవలో ఈ దృశ్యం చూశాక నా హృదయం భయంతో కొట్టుకు లాడిందమ్మా! నీతో చెప్పేవరకూ ఎక్కడికీ వెళ్ళదలచుకోలేదు. జీతగాడు పిలుస్తున్నా గబగబా ఇటు వొచ్చాను."

"మంచి పని చేశావమ్మా!" కాంతమ్మ హృదయం ఆనందంతో గంతు లేసింది.

"అమ్మా! నాకు పెళ్ళి వొద్దే?" అన్నది కాంతమ్మ కూతురు.

'పిచ్చి తల్లి?' అనుకుంటూ కూతుర్ని హృదయానికి హత్తుకుంది కాంతమ్మ.

★